## అండర్‌పాస్‌కు అడుగులు



2





2

## పేలిన కారు ట్యాంకు



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 13వ తేదీ నుంచి 19వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఈ ఏడు రోజుల్లో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ వంద మీటర్ల వరకు ఇద్దరికి మించి గుమిగూడి ఉండరాదన్నారు. అలాగే జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు.


9-5-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## కాంగ్రెస్ వైఫల్యాలతోనే బీఆర్ఎస్‌లోకి వలసలు..

**అక్షరటుడే, భీమ్‌గల్(వేల్పూర్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఆ పార్టీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలో సోమవారం ఏర్గట్ల మండలానికి చెందిన ముఖ్య కాంగ్రెస్ నాయకులు సున్నపు అంజయ్య, జిట్టావోయినా రాజు, నాయుడు పోశెట్టి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా రైతులకు ఇచ్చిన రుణమాఫీ, రైతుబంధు, బోనస్ వంటి హామీలు అటకెక్కాయన్నారు. పంట కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు రోడ్లపై అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజా పూర్ణనందం, ఏర్గట్ల సర్పంచ్ ఉపేందర్, మాజీ జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ మధు, నాయకులు దేవుని నర్సయ్య, బర్మా నర్సయ్య, ప్రభాకర్, కుశ లింబాద్రి పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాద బాధితులను ఆదుకుంటాం

**అక్షరటుడే, ఇందూరు:** షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బీజేపీ నాయకురాలు మీరా వైచల్ కుటుంబానికి అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని అర్సపల్లిలో ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీరా వైచల్ పిల్లల విద్యాభ్యాసానికి తన వంతు సహాయం అందిస్తానన్నారు. షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం కూడా వీలైనంత తొందరగా అందేలా చూడాలని ఆర్డీవో రాజేంద్ర ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలవారి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ మఠం పవన్, బీజేపీ నాయకులు గడ్డం రాజు, పవన్, బంటు ప్రవీణ్, మేదరి శేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు కట్టడేది..!

- వ్యాపారులకు అండగా ఎక్సైజ్ అధికారులు..?
- నామమాత్రపు దాడులు.. శాంపిల్స్ సేకరణ
- పాజిటివ్ కంటే నెగెటివ్ రిపోర్టులే అధికం

**జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారం మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతోంది. అల్ప్రాజోలం లాంటి నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారు చేస్తున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా సామాన్య ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. కల్తీని కట్టడి చేయాల్సిన అధికారులు.. తెర వెనుక వ్యాపారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



జిల్లాలో కల్లు దుకాణాలు వందల సంఖ్యలో ఉన్నాయి. జనవాసాల మధ్య, పాఠశాలలు, ఆలయాల పక్కనే ఉన్నా.. 100 మీటర్ల దూరంలోనే ఉన్నాయంటూ అధికారులు కొలతలు కొలిచి మరీ వ్యాపారులకు సహకరిస్తున్నారు. జిల్లాలో అనేక చోట్ల అల్ప్రాజోలం, డైజోఫాం, తేదీ అయిపోయిన టాబ్లెట్స్‌తో కల్లు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ఈత చెట్లు ఉండేవి. క్రమక్రమంగా వాటి సంఖ్య తగ్గుతూ వచ్చింది. దాంతో కల్లు లభించక ప్రజలు అల్లాడే క్రమంలో మత్తు పదార్థాలతో కల్లును తయారు చేయడం ప్రారంభించారు. ఆ కల్లుకు అలవాటు పడిన ప్రజలు మత్తు తక్కువగా ఉంటే పిచ్చిగా ప్రవర్తించే స్థాయికి చేరుకున్నారు.

### నామమాత్రంగానే దాడులు



కల్తీ కల్లు ఘటనలపై మీడియాలో కథనాలు వచ్చినప్పుడో లేదా ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారు. అప్పటికప్పుడు దుకాణాల వద్దకు వెళ్లి హడావుడి చేసి.. ప్రజల ముందు శాంపిల్స్ తీసుకున్నట్లుగా చేస్తున్నారు. అధికారులు దాడులకు వచ్చే విషయం ముందుగానే కల్లు ముస్తేదారులకు సమాచారం వెళ్తోంది. అధికారులు వచ్చే లోపు వారికి చూయించేందుకు మత్తు కలపని కల్లును అందుబాటులో ఉంచుతున్నారు. అధికారులు వాటి నుంచే శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపిస్తున్నారు.

### నో కల్తీ.. కల్లు ఒరిజినల్..


అధికారులు సేకరించిన శాంపిల్స్ ల్యాబ్‌కు పంపే క్రమంలో నిర్వాహకులు తమ పనిలో నిమగ్నమవుతున్నారు. అధికారులు ప్రజల ముందు ఒక శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపే శాంపిల్స్ మార్చుతున్నట్టుగా ఆరోపణలున్నాయి. ఒకవేళ అదే శాంపిల్ పంపినా వచ్చే రిపోర్టులు తారుమరయ్యేలా నిర్వాహకులు చక్రం తిప్పుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది.

### అధికారుల అండ..

జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతుందని అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. చెట్ల ద్వారా తీసిన కల్లును విక్రయించాలని చెప్పాల్సిన అధికారులు వ్యాపారులకు అండగా నిలుస్తున్నారని బహిరంగంగానే చర్చ సాగుతోంది. ఫలితంగా కల్తీ కల్లు వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. కల్తీని కట్టడి చేసి ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. ఏదైనా ఘటన జరిగినప్పుడే ఉన్నతాధికారులు ఆదేశిస్తేన చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నట్టుగా తెలుస్తోంది. ఇలాగే కొనసాగితే కల్తీ కల్లు తాగి అనారోగ్యం పాలవుతున్న బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

### కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలం

జిల్లాలో కల్తీ కల్లు వ్యాపారం జోరుగా సాగుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటారా.. లేదా అనేది వేచి చూడాలి.



## ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వ ఐటీఐ (మైనారిటీ) బోధన్, నిజామాబాద్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ కె.శాంతారాం తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉపయుక్తమైన ఉద్యోగావకాశాలు పొందేందుకు ఐటీఐ విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ ఐటీఐ (మైనారిటీ) బోధన్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



## రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడంతో అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో అవస్థలు పడుతున్నారని.. కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్నారన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలుచేడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మనోజ్, ప్రేమ్, మున్నా, అఖిలేష్, కార్తీక్, సన్నీ, కిట్టు, రాజేష్, మణిదీప్, చక్రదీప్, అరుణ్, వినోద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నెలల్లో 3,510 డ్రంకన్ డ్రైవ్ కేసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో డ్రంకన్ డ్రైవ్‌ను నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. నియంత్రణకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. గత నాలుగు నెలల్లోనే డ్రంకన్ డ్రైవ్ ద్వారా 3,510 మందిని పట్టుకున్నామని పేర్కొన్నారు. వీరికి రూ.42లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే 508 మంది జైలు పాలయ్యారని వివరించారు. ఇందుకు సంబంధించిన శనివారం ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు.



### మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

ఎస్పీ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 8 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 3,510 మందికి కోర్టులు శిక్షలు విధించాయని తెలిపారు. వీరిపై మొత్తం రూ.42.01 లక్షల భారీ జరిమానా విధించగా సమాజ భద్రతను దృష్టిలో ఉంచుకుని 508 మందికి జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. ఈ చర్యలు మద్యం సేవించి వాహనం నడపడంపై పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నారో ఈ వివరాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. శిక్షల తీవ్రతను పరిశీలిస్తే 499 మందికి ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్షలు పడగా, నేర తీవ్రత ఎక్కువగా ఉన్న తొమ్మిది మందికి వారం నుంచి 15 రోజుల వరకు జైలు శిక్ష విధించారన్నారు. ఇద్దరు నిందితులకు ఏకంగా 31 రోజుల పాటు జైలు శిక్ష పడిందని చెప్పారు.

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు..

మద్యం తాగి రోడ్డు మీదకు వస్తే కేవలం జరిమానాతో తప్పించుకోవడం సాధ్యం కాదని, అవసరమైతే జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడపడం అనేది కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదని, అది ప్రాణాలతో చెలగాటమాడడంతో సమానమని హెచ్చరించారు. కేవలం జరిమానా కట్టి తప్పించుకోవచ్చనే భావన పూర్తిగా తప్పని స్పష్టం చేశారు. డ్రంకన్ డ్రైవ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం ఒక రోజు నుంచి నెల రోజుల వరకు జైలు శిక్షతో పాటు జరిమానాలు పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడం పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## వారంరోజుల్లో 151 కేసులు..: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో రోజుల్లో 151 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల పరిధిలో పోలీసులు వారంరోజుల పాటు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 151 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 11 మందికి న్యాయస్థానాలు జైలుశిక్ష విధించాయని సీపీ తెలిపారు. మిగిలిన వారికి రూ.10,40,000 జరిమానా విధించాయని వివరించారు. ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడితే ఆర్నెళ్లపాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగితే ఎలాంటి ఇన్సూరెన్స్ వర్తించదని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## మహారాణా ప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

### అత్యంత ధైర్యవంతుడైన రాజు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో అత్యంత ధైర్యవంతుడైన రాజుల్లో మహారాణా ప్రతాప్ ఒకరన్నారు. దేశభక్తి ధైర్య సాహసాల్లో ఆయన ప్రత్యేకంగా నిలిచారన్నారు. మొగల్ చక్రవర్తి అక్బర్ ఆధిపత్యానికి ఎదురుగా నిలిచి స్వాతంత్రం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ప్రధానంగా హల్దీ గాటి యుద్ధం ఆయన వీరత్వానికి గుర్తుగా నిలిచిందన్నారు. ఆయన రాజ్యం కోల్పోయిన ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని వివరించారు. శత్రువులకు తలవంచకుండా అడవుల్లో కష్టాలు పడుతూ జీవించారని గుర్తు చేశారు. నేటి యువత మహారాణా ప్రతాప్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బొందిల రజక సంఘం అధ్యక్షుడు బొందిల బలరాం సింగ్, కార్యదర్శి నరేష్ సింగ్, కోశాధికారి మహేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు తులసీరాం, విజయ్ సింగ్, రమేష్ సింగ్, లఖన్ సింగ్, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు పవన్ ముందడ, గోసేవ ప్రతినిధి ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే షిండే

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని సముందర్ తండా మాజీ సర్పంచ్ బన్సీలాల్ మనమరాలు పెళ్లి శనివారం జరిగింది. ఈ వేడుకలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వేడుకలో పాల్గొన్న అతిథులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గోసంరక్షణకు చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రాష్ట్రంలో గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పోలీస్ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ, బజ్‌రంగ్‌దల్ కార్యకర్తలు మాట్లాడుతూ.. గోమాత సకల దేవతలకు స్వరూపమన్నారు. వేదకాలం నుంచి ఆరాధ్య దేవతగా పూజిస్తున్నామని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయం, మానవాళి ఆరోగ్యానికి గోమాత ఆధారమని తెలిపారు. అయితే ప్రస్తుతం విచ్చలవిడిగా గోవులను వధించి మాంసాన్ని వినియోగిస్తున్నారని, వేలాది టన్నుల గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవును కాపాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిషేధ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికైనా గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి డివిజన్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రాజిరెడ్డి, ఎస్సై రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా గో రక్షక్ తులసీదాస్, త్రి ప్రఖండ సంఘటన మంత్రి వినోద్, భరత్, రాజు, పురుషోత్తం, సృజన్, విష్ణు, సందీప్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# 'అండర్ పాస్'కు అడుగులు

■ డిచ్‌పల్లిలోని సీఎంసీ వద్ద.. ■ ఫలించిన ఎంపీ అర్వింద్ కృషి ■ హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**నేషనల్ హైవే–44పై ప్రయాణం అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. మీతిమీరిన వేగం, బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ నేపథ్యంలో డిచ్‌పల్లి మండలం సీఎంసీ ఎదుట 'అండర్ పాస్' నిర్మాణానికి మోక్షం లభించింది. ఎంపీ అర్వింద్ కృషితోనే ఇది సాధ్యమైందని స్థానికులు పేర్కొంటున్నారు.**

**– అక్షరటుడే, డిచ్‌పల్లి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారి పొడవు 95 కిలో మీటర్లు ఉంది. ప్రతి మూడు కిలోమీటర్లకు ఒకటి చొప్పున బ్లాక్ స్పాట్స్ (ప్రమాదకర ప్రదేశం) ఉన్నాయి. రహదారి నిర్మాణ సమయంలో లోపాలు, మానవ తప్పిదాల కారణంగా రోజుకు సగటున ఐదు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారుల సర్వేల్లో తేలింది. అతి వేగంతో బైక్‌లపై దూసుకుపోతున్న యువత కారణంగా పలువురు. ఆస్పత్రుల పాలవుతున్నారు.

### పదుకొండేళ్ల వ్యవధిలో..

గత 11 ఏళ్ల వ్యవధిలో డిచ్‌పల్లిలోని సీఎంసీ బ్లాక్ స్పాట్ వద్ద సుమారు 35 మంది మరణించారు. ఇక్కడ సుద్దపల్లి వైపు సర్వీసు బీటీ రోడ్డు లేక డిచ్‌పల్లి స్టేషన్‌కు వెళ్లే వాహనాలు రాంగ్ రూట్లో వస్తున్నాయి. భారీ వాహనాలు 'యూ' ఆకారపు మలుపు తీసుకోవడంతో వేగంగా వచ్చే ఇతర వాహనాలు ఢీకొంటున్న పరిస్థితి నెలకొంది.

### ఎంపీ కృషితో రూ. 24 కోట్లు

డిచ్‌పల్లి మండలంలోని సీఎంసీ ఎదుట జాతీయ రహదారిపై వంతెన నిర్మాణం, సర్వీస్ రోడ్డు వేయాలని స్థానికులు గతంలో పలుమార్లు ఆందోళన చేపట్టి, ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి వినతులు ఇచ్చారు. దీంతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

హైవే అథారిటీ అధికారులతో మాట్లాడడంతో రూ. 24 కోట్లతో 'అండర్ పాస్' నిర్మాణానికి మోక్షం లభించింది. సీఎంసీ ఎదుట హైవేపై అండర్ పాస్ పనులు ప్రారంభమైనట్లేనని హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. తొలుత సర్వీసు రోడ్డు వేసి వంతెన నిర్మాణం చేపడతారు. ఏడాదిన్నర కాలంలో పనులు పూర్తి చేయాల్సి ఉంది.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..



**అక్షరటుడే, ఆర్మూర్ :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్మూర్ ఎస్సై అరాఫత్ సూచించారు. ఆర్మూర్ మండల గగ్గుపల్లి గ్రామంలో శనివారం మన ఊరు-మన భద్రత మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వేంపల్లి చెరువులో నీటి వినియోగంపై అవగాహన



**అక్షరటుడే, ముప్కాల్:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేంపల్లి గ్రామంలోని చింతల కుంట చెరువులో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సారెస్పీ అధికారులు వేంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ నీటి వినియోగం, చెరువుల పూడిక మట్టి తొలగింపు, నీటి సంరక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. గ్రామ అభివృద్ధి, సాగునీటి వినియోగం మెరుగుపడేలా ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, గ్రామస్థాయి అధికారులు, ఉపాధి కూలీలు, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## మాటుకాలువ నిర్మాణానికి నిధులు మంజూరు

**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో మాటు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సర్పంచ్ ఆర్మూర్ లావణ్య పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాటుకాలువ నిర్మాణానికి నిధులు అవసరం ఉందని అడగగానే మంజూరు చేసిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ. 32 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్, సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు, ఇరిగేషన్ డీఈ వేంకటేశ్వర్లు, ఏఈ జూబేర్, వార్డు సభ్యులు ఆర్మూర్ గణేష్, సుంకరి రాజు, మాజీ సర్పంచ్ మగ్గరి నర్సింగ్ రావు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గంగాధర్, భోజారాం, రాజేందర్, మోహన్, భోజేందర్, భూమయ్య, గంగారెడ్డి పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఏఐసీసీ యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జి సయ్యద్ ఖాలిద్ అహ్మద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్టు మధుసూదన్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణాధ్యక్షుడిగా అజ్మత్, కామారెడ్డి మండలాధ్యక్షుడిగా హన్మాండ్ల రాంకుమార్, భిక్కనూరు మండల అధ్యక్షుడిగా శ్రీరామ్ వెంకటేష్, రాజంపేట మండలాధ్యక్షుడిగా టి.ప్రభాకర్ గౌడ్, బీబీపేట అధ్యక్షుడిగా ఎం.మహేష్, దోమకొండ అధ్యక్షుడిగా పిన్నం నాగేంద్ర వర్మ, పాల్వంచ అధ్యక్షుడిగా సమరసింహా రెడ్డి, మాచారెడ్డి అధ్యక్షుడిగా రాజారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా నియామకమైన అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. యువతను ఏకం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర నాయకత్వం, జిల్లా ఇన్‌ఛార్జీల పర్యవేక్షణలో వీరంతా సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తోడ్పడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారీగా గుట్కా డంప్ స్వాధీనం

**అక్షరటుడే, నిజామాబాద్‌క్రైం:** జిల్లాలో రూ.30లక్షలకు పైగా విలువైన గుట్కా డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. పక్కా సమాచారం ఆధారంగా చీతా ఫోర్స్ సిబ్బంది బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆచన్‌పల్లి గ్రామంలో ఓ షాప్‌లో దాచి ఉంచిన డంప్‌పై దాడులు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌కేజీఎన్ షాప్‌లో డంప్‌తో పాటు హెచ్‌కేజీఎన్ మటన్ షాప్‌లో దాచిన గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా సరుకును చట్టపరమైన చర్యల నిమిత్తం బోధన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు.

## రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: డీఈ కృష్ణమూర్తి




**అక్షరటుడే, ఆర్మూర్:** రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నీటిపారుదల శాఖ డీఈ కృష్ణమూర్తి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో సర్పంచ్ ముక్కెర విజయ్, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రైతువారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వల సంరక్షణలో రైతులు సహకరించాలని, నీటి వృథాను తగ్గించి అవసరానికి అనుగుణంగా వినియోగిస్తే పంటలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి అభివృద్ధి పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. కెనాల్‌పై రెండు కల్వర్టులు నిర్మించాలని, అలాగే ఆలూర్ బైపాస్ రోడ్డులో కాలువ అస్తవ్యస్తంగా ఉండడంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానిని వెంటనే మరమ్మతులు చేసి సరిచేయాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన డీఈ కృష్ణమూర్తి రైతులు తెలిపిన సమస్యలను పరిశీలించి, త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైస్ మల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ములకిడి శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్, వార్డు మెంబర్లు సంజీవ్, మల్లేష్, సాయిలు, శాఖ అధికారులు రాజు, శేఖర్, సాయన్న, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

## పిండిగిర్ని శుభ్రం చేస్తుండగా విద్యుత్‌షాక్.. మహిళ మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** రుణం తీసుకుని ఉపాధి నిమిత్తం పిండి గిర్ని ఏర్పాటు చేసుకున్న ఓ మహిళ.. ఆ గిర్నిని శుభ్రంచేస్తూ విద్యుత్‌షాక్‌తో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డిలో శనివారం చోటు చేసుకుంది. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో బండి రేణుక (35) ఉపాధి నిమిత్తం రుణం తీసుకుని చిన్న పిండిగిర్ని ఏర్పాటు చేసుకుంది. ఈ క్రమంలో ఎప్పటిలాగే శనివారం ఉదయం గిర్ని స్టార్ట్ చేసేముందు నీళ్లుచల్లి శుభ్రం చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టింది. దాంతో ఆమె అక్కడే కిందపడగా తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కామారెడ్డిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దాంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా.. మృతురాలి భర్త యోగేష్ గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

## గ్యాస్ నింపుతుండగా పేలిన కారు ట్యాంకు.. మూడు కార్లు, బైక్ దగ్ధం



**అక్షరటుడే, కామారెడ్డి:** కార్లలో దొంగచాటుగా గ్యాస్ నింపడం చట్టవ్యతిరేకమని తెలిసినా కొందరు డబ్బులకు ఆశపడి అక్రమాలకు పాల్పడుతున్నారు. డొమెస్టిక్ గ్యాస్‌ను యథేచ్ఛగా కార్లలో నింపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఓ కార్‌లో గ్యాస్ నింపుతుండగా ట్యాంకు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో మూడు కార్లు, బైక్ దగ్ధమయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దేవునిపల్లి గ్రామంలో ఓ కారులో సీఎన్జీ గ్యాస్ నింపుతున్నారు. ఈ క్రమంలో కారు ట్యాంకు పేలడంతో దట్టమైన పొగలు వ్యాపించి కారు దగ్ధమైంది. దాంతో పాటు గ్యాస్ నింపుతున్న కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు, ఓ బైక్ దగ్ధమయ్యాయి. కార్లు దగ్ధమయ్యే సమయంలో భారీగా శబ్దాలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. వెంటనే ఫైర్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్‌స్టేషన్ అధికారులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఫైర్‌సిబ్బంది సమయానికి రాకపోయి ఉంటే చుట్టు పక్కల ఇళ్లకు మంటలు వ్యాపించి ఉండేవని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఇసుక టిప్పర్..



**అక్షరటుడే, బాన్సువాడ:** ఓవర్‌లోడ్‌తో అతివేగంగా వెళ్తున్న ఇసుక టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. వర్నిమండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బడా పహాడ్ నుంచి వర్ని వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు మూలమలుపు వద్ద ఆగి ఉండగా, వర్ని నుంచి వేగంగా వస్తున్న ఇసుక టిప్పర్ అదుపుతప్పి బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు సీట్లకు తగిలి గాయపడగా, మరికొందరికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌ల సహాయంతో సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రయాణికులు మాట్లాడుతూ.. బస్సు ఆగి ఉన్న సమయంలోనే టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టిందని తెలిపారు.